సెప్టెంబరు నుంచి పశుగణన

- మొత్తం 16 రకాల వివరాలు సేకరణ
- రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి నాయక్

ఈపీడీసీఎల్‌లో పదోన్నతులు, బదిలీలు

- విశాఖ సర్కిల్ ఎస్ఈగా జి.శ్యామ్‌బాబు
- రాజమండ్రి ఎస్ఈగా గొర్లె ప్రసాద్

· 7లో

అభివృద్ధి పట్టని ఆస్పత్రి కమిటీలు

మందుల కొనుగోలు, వసతులకు నిధులు విడుదలైనా ఆస్పత్రులకు చేరని వైనం

- బ్యాంకు ఖాతాల్లో మూలుగుతున్న రూ.31.85 లక్షలు
- అభివృద్ధి కమిటీల సమావేశాలు జరగకపోవడమే కారణం
- నిధుల విడుదలకు ఆమోదం తెలపాల్సి ఉన్నా నిర్లక్ష్యం
- కమిటీల్లో వైసీపీ ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది ఉండడం వల్లే ఈ పరిస్థితి అని విమర్శలు
- అత్యవసర మందులు అందక రోగులకు ఇబ్బందులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన విషయంలో అభివృద్ధి కమిటీల నిర్లక్ష్యం వల్ల అవరోధాలు ఎదురవుతున్నాయి. వాస్తవానికి నిబంధనల ప్రకారం అభివృద్ధి కమిటీలు సమావేశాలు నిర్వహించి మందుల కొనుగోలు, ఆస్పత్రుల్లో సౌకర్యాల కోసం నిధుల విడుదలకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని చోట్ల కమిటీల సమావేశం ఊసే లేకుండాపోయింది. దీంతో జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి నిధులు విడుదలవుతున్నా అవి వినియోగంలోకి రాక మురిగిపోతున్నాయి.



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి

జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ ఆస్పత్రి, ఎనిమిది కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వం ఆస్పత్రులకు వైద్య ఆరోగ్యశాఖకు చెందిన సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ ద్వారా అందించే మందులే కాకుండా ప్రమాదాలు, ఇతరత్రా అత్యవసర సందర్భాల్లో నిరుపేద రోగులకు వైద్యులు తక్షణం మందులు కొనుగోలు చేసేందుకు, అదే విధంగా ఆస్పత్రిలో మరుగుదొడ్ల నిర్వహణ, ఇతరత్రా మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసేందుకు ఆస్పత్రి అభివృద్ధి నిధులు ఏటా రెండు విడతలుగా జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు విడుదలవుతాయి. ఆ నిధులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి సంవత్సరానికి రూ.10 లక్షలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు రూ.5 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఏటా రూ.1.5 లక్షలు వంతున విడుదల చేస్తారు. జిల్లా ఆస్పత్రులకు జడ్పీ చైర్మన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు ఎమ్మెల్యేలు, పీహెచ్‌సీలకు ఎంపీపీలు చైర్మన్లుగా వ్యవహరించే కమిటీల్లో స్థానికంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉంటారు. అభివృద్ధి కమిటీల సమావేశాల్లో ఆమోదం మేరకు ఈ నిధులు అత్యవసర మందుల కొనుగోలు, వసతుల కల్పనకు వినియోగించాల్సి ఉంటుంది.

కమిటీల సమావేశం ఊసేది?

ఎన్నికల ముందు నుంచి గత నెల వరకు ఎన్నికల హడావిడిలో ఉన్నందున ఆస్పత్రి అభివృద్ధి కమిటీల సమావేశాలు నిర్వహించలేదు. కొన్ని ఆస్పత్రుల్లో అయితే కమిటీల సమావేశాల ఊసే లేకుండా పోయింది. వాస్తవానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆస్పత్రి అభివృద్ధి కమిటీల సమావేశాలు జరగాల్సి ఉంది. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ కమిటీల సమావేశాలను మొక్కుబడి తంతుగా మార్చేసింది. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు, ఇతర కారణాలతో సమావేశాలు నిర్వహించలేదు. దీంతో ఆస్పత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండు నెలలు కావస్తున్నా, ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న ఆస్పత్రి కమిటీల్లో గత వైసీపీ ప్రభుత్వం నియమించిన సభ్యులే ఎక్కువగా ఉండడంతో సమావేశాల నిర్వహణ, ఆస్పత్రుల్లో సమస్యలపై పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 2024లో ఇప్పటి వరకు ఆస్పత్రుల కమిటీలు ఒక్కసారి కూడా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేయకపోవడంతో ప్రభుత్వాస్పత్రులకు ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు కావడం లేదని, దీంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే..

జిల్లాలోని ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి రెండు వారాల కిందట అభివృద్ధి నిధులు విడుదలయ్యాయి. జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ ఆస్పత్రికి రూ.2.5 లక్షలు, జిల్లాలో 8 సీహెచ్‌లకు రూ.1.25 లక్షలు చొప్పున, అదే విధంగా 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రతి ఆస్పత్రికి రూ.43 వేలు వంతున మొత్తం రూ.31.85 లక్షల నిధులు ఆస్పత్రుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. నిధులు విడుదలై రోజులు గడుస్తున్నా కమిటీల సమావేశాలు జరగలేదు. ఇన్నాళ్లు నిధులు లేక అల్లాడిన ఆసుపత్రుల కమిటీలు వచ్చిన నిధుల ఖర్చు ఊసెత్తడం లేదు. వాస్తవానికి 2024 సంవత్సరానికి సంబంధించిన నిధులు గత మార్చి నెలలో విడుదలవ్వాల్సి వున్నా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్పట్లో విడుదల కాలేదు. ఎట్టకేలకు ఆలస్యంగా విడుదలైన నిధులు ప్రస్తుతం ఆస్పత్రుల్లో హెచ్‌వోడీ వైద్యాధికారి, కమిటీల ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో మూలుగుతున్నాయి. పాత కమిటీలు సమావేశాలు జరపక పోగా, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఆస్పత్రుల అభివృద్ధి నిధుల ఖర్చుపై దృష్టి పెట్టడం లేదు. దీంతో వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మందులు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఆస్పత్రుల అభివృద్ధికి మంజూరైన నిధులు ఖర్చుచేసి పేదలకు అత్యవసర వైద్యసేవలు అందేవిధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఆస్పత్రుల అభివృద్ధి నిధుల విడుదల, ఖర్చు చేయకపోవడంపై జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా నిధులు విడుదల వాస్తవమేనని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కమిటీల సమావేశాలు నిర్వహించి నిధులు వినియోగించాలని ఆస్పత్రుల వైద్యులకు సూచించామని తెలిపారు.



సోముదేవపల్లి వద్ద కొట్టుకుపోయిన గట్టు

నది పొంగిందా.. ఊరు గోవిందా!

భారీ వర్షాలకు కోతకు గురైన సోముదేవపల్లి వద్ద గట్టు

- కొట్టుకుపోయిన రెండు గ్రామాల ప్రధాన రహదారి
- ఆయా గ్రామాల ప్రజలు స్థలం లీజుకు తీసుకుని తాత్కాలికంగా రహదారి నిర్మాణం
- వరద వస్తే గ్రామాలు గల్లంతే..
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజల వేడుకోలు

ఎస్.రాయవరం, జూలై 31:

భారీవర్షాలు కురిసే క్రమంలో వరహానది ఉగ్రరూపం దాలిస్తే మండలంలోని పాత సోముదేవుపల్లి, కొత్త సోముదేవుపల్లి గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతుంటారు. వరద నీరు తమ గ్రామాలను ముంచెత్తుతుందేమోనని ఆందోళన చెందుతుంటారు. గత వైసీపీ ప్రభుత్వం గట్టు పటిష్ఠతకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

భారీ వర్షాలకు 2019లో వరహానది ఉధృతంగా ప్రవహించి ఎస్.రాయవరం మండలం సోముదేవపల్లి గ్రామం వద్ద ఉన్న గట్టు భారీగా కోతకు గురైంది. దీంతో పాటు పాత సోముదేవుపల్లి, కొత్త సోముదేవపల్లి గ్రామాల ప్రధాన రహదారి సగం వరకు కొట్టుకుపోయింది. గట్టు పక్కనే ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయం, ఓ శ్లాబ్ ఇల్లు నదిలో కలిసిపోయాయి. రహదారి కోతకు గురికావడంతో రెండు గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు ఏకమై కొట్టుకుపోయిన రహదారి పక్కనే ఉన్న గ్రామంలో ఓ వ్యక్తికి చెందిన పది సెంట్ల స్థలాన్ని లీజుకు తీసుకొని తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించుకున్నారు. దీంతో గ్రామస్థులకు కొంత లభించింది.



కోతకు గురైన వరహానది గట్టుకు పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

వరహానది గట్టు కోతకు గురైనా గత వైసీపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గట్టు కోతకు గురైన రెండేళ్ల తరువాత సుమారు రూ.30 లక్షలతో అప్పట్లో మట్టితో ఫిల్లింగ్ పనులు చేపట్టారు. అయితే అది నెల రోజులకే వరహానది ఉధృతికి కొట్టుకుపోయింది. ఆ తరువాత గట్టు పటిష్ఠతకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు రూ.33.47 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో అప్పటి నుంచి పరిస్థితి అలాగే ఉంది. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ వరహానది ఉగ్రరూపం దాల్చడంతో గట్టు పూర్తిగా కొట్టుకుపోయి కొత్త సోముదేవుపల్లి గ్రామం ముంపునకు గురవుతుందని గ్రామస్థులు ఆందోళన చెందారు. కూటమి ప్రభుత్వం స్పందించి గట్టు పటిష్ఠతకు, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

సోముదేవుపల్లి వద్ద కోతకు గురైన వరహానది గట్టు పటిష్ఠతకు తాత్కాలిక పనుల నిమిత్తం రూ. 15 లక్షల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

\- భాను, ఇరిగేషన్ ఏఈ, ఎస్.రాయవరం

ఇంటి వద్దకే సామాజిక పింఛన్లు

నేటి ఉదయం 6 గంటల నుంచి పంపిణీ

- డీఆర్‌డీఏ పీడీ శశీదేవి

అనకాపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం 6 గంటల నుంచి రెండు రోజుల పాటు కొనసాగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ శశీదేవి తెలిపారు. జిల్లాలో 2,62,624 మంది లబ్ధిదారులకు వారి ఇంటికే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.108.41 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నిధులను ఇప్పటికే బ్యాంకుల నుంచి సంబంధిత సచివాలయాల సిబ్బంది డ్రా చేశారని తెలిపారు. ఆగస్టు 1, 2వ తేదీల్లో పింఛన్ లబ్ధిదారులు ఇళ్ల వద్దే అందుబాటులో ఉండి పింఛన్ సొమ్ము తీసుకోవాలని ఆమె కోరారు.

అడ్డూరులో విషాదం

అల్లుడు దాడి చేయడంతో గాయపడిన మామ మృతి

- నిందితుని అరెస్టు



మృతుడు పైడిరాజు (ఫైల్)



నిందితుడు పైడినాయుడు

చోడవరం, జూలై 31: మండలంలోని అడ్డూరు గ్రామంలో అత్తమామలపై కత్తితో విచక్షణారహితంగా అల్లుడు దాడి చేసిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మామ సానబోయిన పైడిరాజు (55) బుధవారం ఉదయం మృతి చెందారు. భార్యాభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో అత్తమామలపై కక్ష పెంచుకున్న అల్లుడు మామిడి పైడినాయుడు సోమవారం రాత్రి అత్తమామలపై కత్తితో దాడికి తెగబడిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో అత్త లక్ష్మి ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఆమె మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి ఇంటికి తాళం వేసి తీవ్రంగా గాయపడిన మామ పైడిరాజును అల్లుడు పైడినాయుడే విశాఖ కేజీహెచ్‌లో చేర్పించిన వైనం కలకలం రేపింది. కాగా చికిత్స పొందుతూ మామ పైడిరాజు మృతి చెందారు. మృతుడి కుమార్తె సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పైడినాయుడును బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు వయనాడ్, నాడు కోడిపుంజువలస..

పద్దెనిమిదేళ్ల క్రితం గిరిజన గ్రామంపై విరుచుకుపడిన కొండచరియలు

- బురదతో కూడిన వరద ముంచెత్తడంతో 19 మంది సజీవ సమాధి
- పదుల సంఖ్యలో గాయాలపాలు
- భారీగా మూగజీవాలు మృత్యువాత
- ఇళ్లు నేలమట్టం
- హుద్‌హుద్ తుఫాన్‌కు మేదరశాల గ్రామంపైకి కొండచరియలు రావడంతో ఆరుగురు మృతి
- నాటి ఘటనలను జ్ఞప్తికి తెచ్చుకుంటున్న గిరిజనులు

అరకులోయ, జూలై 31:

కేరళలోని వయనాడ్‌లో బురదతో కూడిన వరద ముంచెత్తడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. సోమవారం అర్ధరాత్రి సరిగ్గా 1.30 సమయంలో వరద బీభత్సానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. ముండక్కై గ్రామాన్ని తుడిచిపెట్టేశాయి. ఆ గ్రామంలో నివసిస్తున్న వందల మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. సరిగ్గా...ఇటువంటి ఘటనే పద్దెనిమిదేళ్ల క్రితం నాటి విశాఖపట్నం జిల్లా, నేటి అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం శిరగాం పంచాయతీ కోడిపుంజువలస గ్రామంలో చోటుచేసుకుంది. 2006 ఆగస్టు 3వ తేదీ రాత్రి సమీపంలో గల కొండచరియలు, బురదతో కూడిన వరద గ్రామాన్ని ముంచెత్తాయి. ఈ ఘటనలో 19 మంది సజీవ సమాధి కాగా, పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. నాటి ఘటనను ఈ ప్రాంతవాసులు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.





తల్లీ, బిడ్డ మృతదేహాలు (ఫైల్ ఫొటో)

కోడిపుంజువలస గ్రామంపైకి వరదలా వచ్చిన బురద (ఫైల్)

అరకులోయ మండలం కోడిపుంజువలస గ్రామం...2006 ఆగస్టు 3వ తేదీ అర్ధరాత్రి అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా కొండచరియలు విరుచుకుపడ్డాయి. వాయుగుండం ప్రభావంతో అప్పటికి అరకు లోయ పరిసరాల్లో నాలుగు రోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో వరద బురద రూపంలో పోటెత్తింది. దీంతో 19 మంది సజీవ సమాధి అయ్యారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న చొంపికొండ పైనుంచి బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చాయి. వరద ఉధృతికి చాలామంది నిద్రలోనే దిగువనున్న గెడ్డలోకి ... మిగతా 8వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

ఓటర్లు 822 మంది

- 36 మంది జడ్పీటీసీ సభ్యులు, 636 మంది ఎంపీటీసీ సభ్యులు, 97 మంది జీవీఎంసీ కార్పొరేటర్లు
- నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో 53 మంది కౌన్సిలర్లు
- ఉమ్మడి జిల్లాలో అమలులోకి కోడ్
- కలెక్టర్ల సదస్సుకు హాజరుపై ఈసీకి కలెక్టర్ లేఖ

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, జీవీఎంసీలో కార్పొరేటర్లు, ఎలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీల కౌన్సిలర్లు మొత్తం 822 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలో 39 జడ్పీటీసీ సభ్యులకుగాను ప్రస్తుతం 36 మంది ఉన్నారు. హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అరకులోయ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో జడ్పీటీసీ సభ్యుని పదవికి రాజీనామా చేశారు. సబ్బవరం, రావికమతం జడ్పీటీసీ సభ్యులు తుంపాల అప్పారావు, తలారి రమణమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందారు. మొత్తం మూడు జడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

కాగా 652 ఎంపీటీసీ స్థానాలకుగాను వివిధ కారణాలతో ప్రస్తుతం 636 మంది, జీవీఎంసీలో 98 కార్పొరేటర్లకుగాను 97 మంది ఉన్నారు. 21వ వార్డు నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ తదనంతరం ఎమ్మెల్సీ కావడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ఎలమంచిలి మునిసిపాలిటీలో 25 మంది, నర్సీపట్నం మునిసిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేయడంతో ఉమ్మడి జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది.

కలెక్టర్ల సదస్సుకు హాజరుపై ఈసీకి కలెక్టర్ లేఖ

ఆగస్టు ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టర్ల సదస్సుకు హాజరుకావాలా? లేదా?...అన్న దానిపై స్పష్టత కోసం ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ లేఖ రాయనున్నారు. కలెక్టర్ల సదస్సులో జిల్లాల ప్రగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన అంశాలపై నివేదికలు రూపొందించి ... మిగతా 8వ పేజీలో

ఇష్టానుసారంగా నాడు-నేడు పనులు

అవసరం లేకున్నా హైస్కూల్స్‌కి అదనపు భవనాలు మంజూరు

- సగంలో పనులు నిలిపివేత
- నిరుపయోగంగా నిర్మాణాలు
- రూ.లక్షల్లో ప్రజాధనం వృథా

బుచ్చెయ్యపేట, జూలై 31:

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు ఇష్టానుసారంగా చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని చోట్ల అవసరం లేకున్నా చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలను మధ్యలో నిలిపివేయడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది.

రెండేళ్ల క్రితం మండలంలోని సీతయ్యపేట జడ్పీ హైస్కూల్‌లో ఏడు అదనపు గదుల నిర్మాణానికి రూ.89 లక్షల నిధులు మంజూరయ్యాయి. తొలి విడతగా రూ.34 లక్షలు విడుదల చేశారు. శ్లాబ్ స్థాయి నిర్మాణ పనులకు సుమారు రూ.24 లక్షలు ఖర్చయ్యాయి. వాస్తవానికి ఇక్కడ అదనపు గదుల అవసరమే లేదు. ఈ పాఠశాలలో 330 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపడా గదులు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ అదనంగా మరో ఏడు గదుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. సగం వరకు నిర్మాణాలు జరగాక పనులను నిలిపివేశారు. ఇంకా పాఠశాల ఖాతాలో ఉన్న రూ.10 లక్షల నిధులను ఖర్చు చేయవద్దని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అలాగే తురకలపూడి జడ్పీ హైస్కూల్‌లో మూడు అదనపు గదుల నిర్మాణం, ఇతర పనుల కోసం మంజూరైన రూ.71.81 లక్షల్లో సుమారు రూ.55.29 లక్షలు ఖర్చు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు పనులు నిలిచిపోయాయి. రాజాం జడ్పీ హైస్కూల్ అదనపు గదులు, ఇతర పనులు కోసం రూ.38.61 లక్షలు మంజూరయ్యాయి. నాలుగు గదుల నిర్మాణాలకు పునాదుల తవ్వి పిల్లర్లు, ప్లింత్ బీమ్ వేశారు. దీనికి రూ.3 లక్షల ఖర్చయ్యాక, అధికారుల ఆదేశాల మేరకు అదనపు గదుల నిర్మాణ పనులు నిలిపివేసి, మిగతా పనులు చేస్తున్నారు. అదనపు గదుల నిర్మాణాలు చేపట్టి, పూర్తి చేయకుండా మధ్యలో వదిలేయడంతో రెండేళ్లుగా అసంపూర్తి నిర్మాణాలు నిరుపయోగంగా మిగిలాయి.



సీతయ్యపేటలో శ్లాబ్ దశలో నిలిచిపోయిన అదనపు గదుల భవన నిర్మాణ పనులు

క్రైం... crime news

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూలై 31: పట్టణంలోని వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర ఆలయ సమీపంలో బుధవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. కూండ్రం గ్రామానికి చెందిన గనిశెట్టి రాజబాబు (53) ఆలయ సమీపంలో సిమెంట్ పనులు చేస్తుండగా, విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అతనిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి అన్న అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతి

» పాములపుట్ట సమీపంలో మృతదేహం లభ్యం

హుకుంపేట, జూలై 31: పామురాయిగెడ్డలో ఇటీవల గల్లంతైన యువకుడు మృతి చెందాడు. ఒడిశా సరిహద్దులో బుధవారం అతని మృతదేహం లభ్యమైంది. డుంబ్రిగుడ మండలం గుంటసీమ పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లో సోమనాథ్ (18) ఇసుక తవ్వకాల కోసం హుకుంపేట మండలంలోని పామురాయిగెడ్డలు దిగాడు. తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో గెడ్డ ప్రవాహానికి సోమనాథ్ గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు హుకుంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో నాలుగు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఒడిశా సరిహద్దులోని పాములపుట్టు గ్రామ సమీపంలో గెడ్డ వద్ద సోమనాథ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ సతీష్ తెలిపారు. కాగా, సోమనాథ్ మృతితో తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ఎలమంచిలి, జూలై 31 : మండలంలోని పురుషోత్తపురం జంక్షన్ సమీపం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఇందుకు సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం బవులువాడ పంచాయతీ ఆర్‌వీఎస్ నగర్‌కు చెందిన జి.ప్రకాశమ్మ(73) పురుషోత్తపురం జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారుజామున నడిచి వెళుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలకు గురైన ఆమెను స్థానికులు ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి


మృతి చెందిన దేవి

డుంబ్రిగుడ, జూలై 31: మండలంలోని పోతంగి పంచాయతీ బల్లుగుడ గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అరమ గ్రామానికి చెందిన బంగురు దేవి (29)కి పోతంగి పంచాయతీ బల్లుగుడ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల ఇంటిలో ఉంటున్న దేవి, బుధవారం మధ్యాహ్నం బల్లుగుడ గ్రామంలోని తన భర్త ఇంటికి బయలుదేరింది. డుంబ్రిగుడలో దిగి బల్లుగుడ వెళ్తుండగా మార్గమధ్యంలోని పొదాల వద్ద ఆమె అపస్మారక స్థితిలో పడిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు డుంబ్రిగుడ పీహెచ్‌సీకి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది వెంటనే దేవిని పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స ప్రారంభించినప్పటికే దేవి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని, మృతదేహాన్ని అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 13 మందికి జరిమానాలు


వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 31 : మద్యం సేవించి వాహనాలు నడిపిన పదమూడు మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ 13వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి బి.వి.వి జయలక్ష్మి బుధవారం తీర్పు చెప్పినట్టు అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో పదమూడు మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారన్నారు. ఇదిలావుంటే, ద్విచక్ర వాహనచోదకులకు ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను కళ్లకు కట్టినట్టు వివరించారు.

స్టాండింగ్ కమిటీ నామినేషన్లన్నీ ఓకె

» ముగిసిన పరిశీలన

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించి దాఖలైన 20 నామినేషన్లు సక్రమంగా ఉన్నందున వాటన్నింటినీ ఆమోదించినట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్ సహా టీడీపీ నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది నామినేషన్లు వేశారు. మంగళవారంతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియడంతో బుధవారం వాటిని అధికారులు పరిశీలించారు. నిబంధనలు ప్రకారం నామినేషన్ పత్రాలు ఉండడంతో వాటన్నింటినీ అనుమతిస్తున్నట్టు కమిషనర్ వివరించారు. నామినేషన్లను ఎవరైనా ఉపసంహరించుకోవాలనుకుంటే ఆగస్టు నెల మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు ఉందన్నారు. ఏడున ఎన్నిక, అదేరోజు ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 31: వివిధ ట్రేడుల్లో ఐటీఐ పాసైన విద్యార్థులు ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జోనల్‌స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.సుధాబిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటీస్‌షిప్‌ఇండియా.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 16లోగా తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. జిల్లాలవారీగా ఉన్న ఖాళీలను ప్రకటించారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాలకు డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ ట్రేడులు, విశాఖ జిల్లాకు డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, విజయనగరం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడులకు ఖాళీలు ఉన్నాయన్నారు. విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల వారు ఈనెల 22న, కోనసీమ, విజయనగరం జిల్లాల అభ్యర్థులు 23న, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాల అభ్యర్థులు 24న, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల అభ్యర్థులు 27న విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్‌స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 08922-294906 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	82.00
లైవ్ ధర	102.00
విత్ స్కిన్	174.00
స్కిన్ లెస్	184.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

» గంజాయి రవాణా కట్టడికి ప్రత్యేక నిఘా
» బాలికలు, మహిళలపై నేరాలు జరగకుండా అనుక్షణం అప్రమత్తం
» పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ దీపిక ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ దీపిక

తుమ్మపాల, జూలై 31: జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. అనకాపల్లిలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, ముఖ్యమైన, తీవ్రతరమైన కేసుల వివరాలు, గంజాయి, మిస్సింగ్ కేసుల వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి రవాణా జరిగే ఆంధ్రా, ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం వైపు వివిధ మార్గాల్లో రవాణా జరిగే గంజాయిని గుర్తించడంతో పాటు ఇంటిలిజెన్సీ సమాచార సేకరణ, ఆకస్మిక డైనమిక్ వాహన తనిఖీలను నిర్వహించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో తప్పించుకొని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయాలన్నారు. గంజాయి రవాణా కేసుల్లో పోలీస్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికలు, మహిళలపై జరిగే నేరాల పట్ల పోలీస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నేరాలను నియంత్రించేందుకు పగలు, రాత్రి గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. బ్యాంక్‌లు, ఏటీఎంల దగ్గర ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ క్రైమ్, నేరాల నియంత్రణకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా నేర నియంత్రణలో ప్రతిభ చూపిన 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో పదోన్నతులు, బదిలీలు

» విశాఖ సర్కిల్ ఎస్ఈగా జి.శ్యామ్‌బాబు
» రాజమండ్రి ఎస్ఈగా గొర్లె ప్రసాద్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో పలువురికి బుధవారం పదోన్నతులు కల్పించారు. మరికొందరిని బదిలీ చేశారు. ఈపీడీసీఎల్ పరిధి శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు ఉండడంతో అన్నింటిని దృష్టిలో ఉంచుకొని సీఎండీ పృథ్వీతేజ్ ఈ బదిలీలు చేశారు. విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీసులో జీఎం (ఆపరేషన్స్-2)గా పనిచేస్తున్న జి.శ్యాంబాబును విశాఖ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. విశాఖ ఎస్ఈగా పనిచేస్తున్న ఎల్.మహేంద్రనాథ్‌ను కార్పొరేట్ ఆఫీసులో క్వాలిటీ కంట్రోల్ జీఎంగా బదిలీ చేశారు. కాకినాడలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొర్లె ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి రాజమహేంద్రవరం ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. అక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న టీవీఎస్ఎన్ మూర్తికి పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్ట్స్ సీజీఎంగా వేశారు. విశాఖలో ప్రాజెక్ట్స్ జీఎంగా ఉన్న బి.అశోక్‌కుమార్‌కు సీజీఎంగా పదోన్నతి ఇచ్చి కార్పొరేటర్ కార్యాలయంలో వేశారు. పలాసలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొప్పు ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి విశాఖ కార్పొరేట్ ఆఫీసులో ఆపరేషన్స్ జీఎంగా నియమించారు. తాడేపల్లిగూడెంలో ఈఈగా పనిచేస్తున్న ఎ.రఘునాథబాబుకు పదోన్నతి ఇచ్చి కార్పొరేట్ ఆఫీసులో ప్రాజెక్ట్స్ జీఎంగా వేశారు. పార్వతీపురంలోని ఈఈ వెంకటేశ్వరరావును కార్పొరేట్ కార్యాలయంలో ఎనర్జీ ఆడిట్‌కు, కార్పొరేట్ కార్యాలయంలో ఈఈ సురేశ్‌కుమార్‌ను శ్రీకాకుళం టెక్నికల్ ఈఈగా, రాజమహేంద్రవరం ఈఈ ఉదయ భాస్కర్‌ను కాకినాడ ఆపరేషన్స్ ఈఈగా, శ్రీకాకుళంలోని ఈఈ ఎ.రాజశేఖర్‌ను రాజమహేంద్రవరం ఈఈగా బదిలీ చేశారు.

అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో డిప్యూటీ ఈఈ బి.రఘుకు పదోన్నతి కల్పించి తాడేపల్లిగూడెం వేశారు. విజయనగరం డిప్యూటీ ఈఈ పి.మురళీకృష్ణకు పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో పర్చేజెస్ ఈఈగా బదిలీ చేశారు. శ్రీకాకుళంలోని డిప్యూటీ ఈఈ పి.యోగీశ్వరరావుకు పదోన్నతి ఇచ్చి ఆపరేషన్స్ ఈఈగా పలాస బదిలీ చేశారు. సింహాచలంలోని డిప్యూటీ ఈఈ కె.గోపాలరావునాయుడికి పదోన్నతి కల్పించి పార్వతీపురం ఆపరేషన్స్ ఈఈగా బదిలీ చేశారు. వీరు కాకుండా మరికొందరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి బదిలీలు చేశారు.

క్లాత్ బ్యాగులనే వినియోగించాలి

» శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు


క్లాత్ బ్యాగులను ప్రదర్శిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ తదితరులు

నర్సీపట్నం, జూలై 31: ఎల్లప్పుడూ క్లాత్ సంచులు మాత్రమే వినియోగించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ దశాబ్ది వేడుకల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేతుల మీదుగా నిర్వాహకులు నార సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ ప్రజలు పాలిథిన్ సంచులు వాడి విచ్చవిడిగా వాడి రోడ్డు మీద పడేస్తున్నారని, ఆ వ్యర్థాలు భూమిలో కలవకపోవడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార వ్యర్థాలతో పాలిథిన్ కవర్లను రోడ్డు మీద పడేయడంతో వాటిని పశువులు తిని ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయన్నారు. మానవ తప్పిదాలకు మూగ జీవాలు బలికావడం అమానుషం అన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడకుండా నార, వస్త్ర సంచులు వాడాలని పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ చేపడుతున్న ప్లాసిక్ నిషేధానికి అందరూ సహకరించాలన్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు భార్య పద్మావతి మాట్లాడుతూ 26వ వార్డులో ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కుప్పిలి స్వామి, జాయిట్ సెక్రటరీలు పి.శ్రీను, వాకాడ శంకర్‌రెడ్డి, కోశాధికారి అల్లు అప్పారావు, పూర్వపు అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, కార్యదర్శి ఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సెప్టెంబరు నుంచి పశుగణన

» మొత్తం 16 రకాల వివరాలు సేకరణ
» పశు సంవర్ధక శాఖ సీఎస్ నాయక్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎస్, తదితరులు


మాట్లాడుతున్న నాయక్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి డిసెంబరు వరకు పశుగణన ప్రారంభమవుతుందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో పశుగణనపై ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లకొకసారి ఈ పశుగణన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొత్తం 16 రకాల జంతువుల వివరాలు ఇంటింటికీ వెళ్లి సేకరించాలన్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, జడల బర్రెలు, నాటు పందులు, సీమపందులు, పౌల్ట్రీ కోళ్లు, నాటు కోళ్లు, టర్కీ కోళ్లు, కుక్కలు తదితర వాటి వివరాలు నమోదుకు ప్రత్యేకించి యాప్ రూపొందించామన్నారు. పూర్తిస్థాయి డిజిటలైజేషన్ ప్రక్రియలో గణన చేయాలని సూచించారు. కోళ్ల ఉత్పత్తిలో ఏపీ దేశంలో రెండో స్థానంలో, మేకలు/గొర్రెల ఉత్పత్తిలో నాలుగు, పాల ఉత్పత్తిలో ఐదో స్థానంలో ఉందన్నారు. 2019లో చేపట్టిన గణన మేరకు రాష్ట్రంలో 46,00,087 ఆవులు, 62,19,499 గేదెలు, 1,76,26,971 గొర్రెలు, 55,22,133 మేకలు, 91,958 పందులు, 10,78,63,152 కోళ్లు ఉన్నాయన్నారు. దేశ స్థూల ఉత్పత్తికి 1,40,979 కోట్ల ఆదాయం ఈ రంగం నుంచి వస్తున్నదన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని డిసెంబరు నెలాఖరుకు పశుగణన పూర్తిచేయాలన్నారు. ఇంటింటి నుంచి సేకరించిన సమాచారాన్ని మదించి వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌లో పశుగణన వివరాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడిస్తుందన్నారు. పశు సంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 42 లక్షల కుటుంబాలు ఈ రంగంలో ఉన్నాయన్నారు. కేంద్ర పశు సంవర్ధకశాఖ గణాంకాల విభాగం సలహాదారు జగత్ జకారియా మాట్లాడుతూ గణనలో కచ్చితత్వం పాటించాలన్నారు. భారత పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ డైరెక్టర్ వీపీ సింగ్ మాట్లాడుతూ పశుగణన కోసం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో యాప్ రూపొందించామన్నారు. ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ వర్చువల్‌గా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పశు సంవర్ధక రంగం ద్వారా వస్తున్న ఆదాయంలో భారత్ వాటా 11 శాతంగా ఉందన్నారు. ప్రాంతీయ సదస్సులో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎండ సింహాచలం, విశాఖ జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కె.రామకృష్ణ, పలువురు అధికారులు, మూడు రాష్ట్రాల నుంచి నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రూ. 2 కోట్ల టర్నోవర్‌కు చోడవరం మహిళా సంఘం

» మేనేజర్ లక్ష్మి


మహాజన సభలో మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు

చోడవరం, జూలై 31 : వ్యాపారం ప్రారంభించిన తక్కువ సమయంలోనే తమ సంఘం రూ.రెండు కోట్ల లావాదేవీలకు చేరడం ఆనందంగా ఉందని స్థానిక చోడవరం మహిళా పొదుపు సంఘం మేనేజర్ సిరసపల్లి లక్ష్మి అన్నారు. బుధవారం కో- ఆపరేటివ్ కాలనీలోని సంఘ భవనంలో సంఘం మూడో మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పొదుపు సంఘం ప్రారంభించిన మూడేళ్లలోనే ఈ స్థాయిలో వ్యాపారం పెరగడం సంఘంపై మహిళలకు ఉన్న నమ్మకం వల్లే సాధ్యమైందన్నారు.వదవవల సంఘం కార్యకలాపాలను మరింత విస్తరించన్నట్టు చెప్పారు. వచ్చే ఏడాదికి పదివేల మంది సభ్యుల నమోదుతో పాటు, టర్నోవర్‌ను రూ.5 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. సంఘానికి సొంతంగా భవన నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. నూతన అధ్యక్షురాలిగా పుల్లేటి వరహాలమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులకు బీమా పరిహారం చెక్కులు పంపిణీ చేశారు.

ఉపాధి కల్పనకు 'సింహాద్రి' కృషి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, జూలై 31 : నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా సింహాద్రి ఎన్టీపీసీ పనిచేస్తుందని సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. సింహాద్రి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా విజయవాడకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) ద్వారా యువతకు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన వారికి సీజీఎం బుధవారం సర్టిఫికెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఇటువంటి శిక్షణ శిబిరాలను యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్ హెడ్ బీటీ పాత్ర, సీఎస్ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీఐపీఈటీ హెడ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి సాగుగా డ్రాగన్ ఫ్రూట్


వడ్డాది-కొత్తూరులో ఇంటి శ్లాబ్‌పై పెంచుతున్న డ్రాగన్ ఫ్రూట్

బుచ్చెయ్యపేట, జూలై 31: వడ్డాది-కొత్తూరుకు చెందిన ఎలిసెట్టి ఈశ్వరరావు తన ఇంటి పై కప్పుపై డ్రాగన్ ఫ్రూట్స్ పెంచుతున్నారు. ఒకప్పుడు ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే ఈ డ్రాగన్ ఫ్రూట్‌ను మండలంలో సాగు చేపట్టారు. అధిక పోషకాలు, రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఈ ఫ్రూట్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వ్యవసాయ భూములోనే కాకుండా పెరట్లో, ఇంటి శ్లాబ్‌లపై కూడా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే వీలుంటుంది. ఈశ్వరరావు ఇంటి పై కప్పుపై ప్లాస్టిక్ తొట్టెలో పెంచిన మొక్కకు ఇప్పటికే 10 డ్రాగన్ ఫ్రూట్స్ పక్వానికి వచ్చాయి. మరో పది ఫ్రూట్స్ పక్వానికి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. మార్కెట్లో ఒక్కో ఫ్రూట్ రూ.50 నుంచి 100ల వరకు ధర పలుకుతోంది. 30 సంవత్సరాల పాటు కాపు కాసే డ్రాగన్ ఫ్రూట్స్ పెరటి సాగుగా చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఈశ్వరరావు తెలిపారు.

నేడు కోనాం జలాశయం నుంచి సాగునీరు విడుదల


కోనాం జలాశయంలో కళకళలాడుతున్న సాగునీరు

చీడికాడ, జూలై 31: మండలంలోని కోనాం పాలవెల్లి జలాశయం నుంచి ఖరీఫ్ సీజన్‌కు వరినాట్లు వేసు కునేందుకు ఆగస్టు 1న సాగునీరు విడుదల చేయనున్నట్టు జల వనరుల శాఖ ఏఈఈ సీహెచ్ జయరాం పడాల్ తెలిపారు. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.40 మీటర్లకు చేరుకుందన్నారు. ఇన్‌ఫ్లో 30 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో 150 క్యూసెక్కుల వరకూ సాగునీరు వృథాగా పోతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి గురువారం ఉదయం 10 గంటలకు నీటిపారుదలశాఖ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడు, సాగునీటి సంఘాల రైతులు, నాయకులు హాజరు కానున్నారన్నారు.

పురోహిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా 'పెద్దింటి'


జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న సూర్యనారాయణమూర్తి

ఎలమంచిలి, జూలై 31: అనకాపల్లి జిల్లా పురోహిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఎలమంచిలికి చెందిన పెద్దింటి సూర్యనారాయణ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం శిల్పారామంలో బుధవారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు పెద్దింటి ఇక్కడి విలేకరులకు తెలిపారు. సమాఖ్య రాష్ట్ర ప్రతినిధులు చేతుల మీదుగా జిల్లా అధ్యక్షుడిగా తాను నియామక పత్రాన్ని అందుకున్నట్టు వివరించారు. బ్రాహ్మణ పురోహిత సమాఖ్య అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

కోడ్ ఉండగానే బదిలీలు

» పోలీస్ శాఖలో డీఎస్పీల బదిలీ నిలిపివేత
» ఈపీడీసీఎల్‌లో మాత్రం ఎస్ఈలు, డీఈల బదిలీలు
» జీవీఎంసీలో కూడా...

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మంగళవారం షెడ్యూల్ ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటన జారీచేస్తూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్టు వివరించారు. ఇదిలావుండగా పోలీస్ శాఖలో డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో ఎక్కడా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించిన బదిలీలు లేవు. నియామకాలు లేవు. కానీ ఏపీఈపీడీసీఎల్‌లో బుధవారం భారీగా బదిలీలు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు బదిలీలు చేశారు. విశాఖ సర్కిల్ ఎస్ఈగా శ్యాంబాబును నియమించగా, ఆయన రాత్రి ఏడు గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అలాగే జీవీఎంసీలో అదనపు కమిషనర్‌గా డీవీ రమణమూర్తిని నియమించారు. ఆయన సాంఘిక సంక్షేమ శాఖ నుంచి వచ్చారు. డిప్యుటేషన్‌పై గాజువాకలో పనిచేస్తున్న అదనపు కమిషనర్ వి.సన్యాసిరావును మాతృశాఖకు పంపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కొందరు బదిలీలను ఆపగా, మరికొందరు బదిలీలు చేపట్టారు. దీనిపై అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. దీనిపై కలెక్టర్ కార్యాలయంలో సంప్రతించగా, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందిని బదిలీ చేయకూడదని, ఇతర శాఖలకు ఇది వర్తించదని ఒక అధికారి తెలిపారు.

అయితే ఎన్నికల కోడ్ అంటే అన్ని శాఖలకు వర్తిస్తుందని, మినహాయింపు ఏమీ ఉండదని మరో అధికారి వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టరే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

బంగారమ్మపాలెంలో ఎస్‌డీసీ బృందం పర్యటన

ఎన్‌వోబీ ఏర్పాటు నేపథ్యంలో బోట్లు నిలిపేందుకు ప్రత్యామ్నాయ స్థల పరిశీలన



తీర ప్రాంతాన్ని సందర్శిస్తున్న ఎస్‌డీసీ మనోరమ తదితరులు

ఎస్.రాయవరం, జూలై 31: మండలంలోని బంగారమ్మపాలెం సముద్రతీర ప్రాంతంలో ఎస్‌డీసీ మనోరమ బుధవారం డీఎఫ్‌వో ప్రసాద్, ఎఫ్‌డీవో రవితేజలతో కలిసి పర్యటించారు. నేవల్ ఆల్టర్‌నేట్ ఆపరేటింగ్ బేస్ (ఎన్‌వోబీ) ఏర్పాటు కారణంగా ఇక్కడి మత్స్యకారులు బోట్లు నిలిపే స్థలాన్ని కొద్ది రోజుల్లో ఖాళీ చేయించే అవకాశం ఉండడంతో ఎస్‌డీసీ బృందం సదరు గ్రామానికి విచ్చేశారు. ఇందులో భాగంగా మత్స్యకారులు బోట్లు నిలుపుకోవడానికి ప్రత్యమ్నాయంగా కావల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. మళ్లీ మార్పులు చేయకుండా నిత్యం ఒకేచోట బోట్లు నిలుపుకునేలా స్థలాన్ని కేటాయించాలని స్థానిక మత్స్యకారులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువను పరిశీలించిన డీపీవో



ఎస్.రాయవరంలో పంట కాలువను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

ఎస్.రాయవరం, జూలై 31: ఇక్కడి సర్వసిద్ధి పంట కాలువను డీపీవో శిరీషారాణి బుధవారం పరిశీలించారు. చాలా కాలంగా ఈ కాలువ ద్వారా ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలంటూ రైతులు డీపీవోకు ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంతో ఆమె సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పంట కాలువ ద్వారా మురుగు ప్రవహించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం గ్రామంలో ఉన్న సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పంచాతీలోని తడి, పొడి చెత్తను ఇక్కడ సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

ఎలమంచిలి, జూలై 31 : పట్టణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు విగ్రహం ఏర్పాటుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి అనుమతి మంజూరు చేయాలని కోరుతూ బుధవారం టీడీపీ, జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావుకు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన పట్టణ అధ్యక్షులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీనులు మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహాన్ని నిర్మించేందుకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అన్న క్యాంటీన్ సమీపంలో ఈ విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణలతో పాటు రెండు పార్టీల నాయకులు పల్లా సత్యనారాయణ, కరణం రవి, గుర్రాల రాము, డి.పెంటయ్య, ఆడారి రమణ తదితరులు పాల్గొన్నారు.

అడుగేస్తే జర్రు...న జారుడే

- పలు గ్రామాల్లో అధ్వానంగా రహదారులు
- ఓ వైపు గోతుల భయం.. మరోవైపు బురదమయం
- గత ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు
- ఎన్నిసార్లు విన్నవించినా నిధుల్లేవని సమాధానం చెప్పేవారని ఆయా గ్రామస్థులు ఆవేదన



అచ్యుతాపురం మండలం నెట్టివానిపాలెం చేరాలంటే ఇలా బురద నీటిలో వెళ్లాల్సిందే



అచ్యుతాపురం, జూలై 31 : మండలంలోని దోసూరు పంచాయతీ నెట్టివానిపాలెం గ్రామస్థులు సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోసూరు- తంతడి ప్రధాన రోడ్డు నుంచి నెట్టివానిపాలెం సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గతంలో ఈ గ్రామానికి పొలం గట్లు మీదుగా వెళ్లేవారు. అయితే గ్రామస్థులంతా తమ భూముల్లో కొంత భాగాన్ని వదులు కొని రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కానీ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఈ గ్రామం గురించి పట్టించుకోలేదు. సరైన రోడ్డు వేయాల్సిందిగా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకునేవారు లేకపోయారని గ్రామస్థులు వాపోతున్నారు. నిధులు లేవంటూ చేతులెత్తేశారని చెపుతున్నారు. ఫలితంగా ఏ మాత్రం వర్షం పడినా ఈ రోడ్డుపై ప్రయాణానికి నరకాన్ని చూస్తున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. బురద, ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుండడంతో పాదచారులతో పాటు ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురువుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ గ్రామానికి రోడ్డు కష్టాలు తీర్చాలని అంతా కోరుతున్నారు.



'పేట' మండలం నామవరం జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితి

పాయకరావుపేట రూరల్ : నామవరంలో గల జగనన్న కాలనీలో రోడ్లు అధ్వాన్నంగా మారడంతో రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్రోచ్ రోడ్డుతో పాటు కాలనీలోని రోడ్లన్నీ గుంతలమయంగా తయారయ్యాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు వాటిలో నీరు చేరడంతో మరింత ఛిద్రంగా మారాయి. ఈజగనన్న కాలనీలో నామవరం, గుంటపల్లి, సీతారాంపురం గ్రామాలకు చెందిన 168 మందికి పట్టాలు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటికే చాలామంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ కాలనీ లేఅవుట్ వేసినప్పుడు ఎన్ఆర్‌జీఎస్ నిధులు సుమారు ఐదు లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్లు వేశారు. చిన్నపాటి వర్షానికే అవి బురదమయంగా మారి నివాసితులు నడవడానికే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ కాలనీకి అప్రోచ్ రోడ్డు, ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు కల్పించాలని అంతా కోరుతున్నారు.

విన్నపాల వెల్లువ

- హోం మంత్రిని కలిసిన నియోజకవర్గంలోని పలువురు ప్రజలు
- సమస్యలపై ఏకరువు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున మాట్లాడని అనిత



గుంటపల్లిలో వినతులు స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, జూలై 31: సమస్యలపై హోం మంత్రి వంగలపూడి అనితకు వినతులు వెల్లువెత్తాయి. మండలంలోని గుంటపల్లి గ్రామంలో బుధవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెడ్డం బుజ్జి ఇంటికి ఆమె విచ్చేశారు. అభి వృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయవలసి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాటిని రద్దు చేసుకున్నారు. తొలుత ఆమె గ్రామంలోని దుర్గాంబిక ఆలయాన్ని సందర్శిం చుకుని పూజలు నిర్వహించారు. అనంతరం బుజ్జి ఇంటికి వచ్చిన ఆమెకు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు వినతి పత్రాలను అందజేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఆమె ఏమీ మాట్లాడ లేదు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, పార్టీ నాయకులు గొర్లెరాజుబాబు, గూటూరు శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు, యాళ్ల వరహాలు, చిక్కాల శ్రీనివాసరావు, నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎం.రమాకుమారి, ఆకేటి శాంతి, జనసేన నాయకులు తోట నగేష్, గెడ్డం కన్నబాబు, గెడ్డం చైతన్య, జగ్గన్నదొర, వెలగా సుధాకర్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'సాగుదారులకు పరిహారం ఇవ్వండి'

నక్కపల్లి : మండలంలోని డీఎల్‌పురంలో గల కొన్ని సర్వే నెంబర్లలో పూర్వం నుంచి నిరుపేదలు సాగు చేసుకుంటున్న 102.72 ఎకరాల భూమిని విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం తీసుకున్నందున వాటి సాగుదారులకు పరిహారం ఇవ్వాలని హోం మంత్రి అనితను పలువురు కోరారు. సుమారు 150 మంది నిరుపేదలు ఈ భూముల్లో కొబ్బరి, జీడి తోటలు సాగు చేసుకుని ఫలసాయం అనుభవిస్తున్నారని డీఎల్‌పురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గింజాల వెంకట రమణ, జనసేన మండల అధ్యక్షుడు వెలగా సుధాకర్ మంత్రికి వివరించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించేలా ఏర్పాట్లు చేయాల్సిందిగా వారు కోరారు.

4న ఆదివాస మహోత్సవం



భువనేశ్వరీదేవి అమ్మవారు

సబ్బవరం, జూలై 31 : ఆరిపాక శివారు పెదయాతపాలెం సమీపం మణిపురం బొడ్డ భావి చెల్లయ్యమ్మ తోట వద్ద కొలువుదీరిన భువనేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో ఆగస్టు నాలుగో తేదీన ఆదివాస మహోత్సవం జరగనుందని ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున తామరపత్రితో ప్రత్యేక పూజలు జరుపుతామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించిన ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, జూలై 31 : పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌ను జిల్లా ఎస్పీ ఎం.దీపిక బుధవారం సాయంత్రం పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వివరాలను పోలీస్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ స్థానంలో జిల్లా పోలీస్ కార్యాలయం, పోలీస్ అధికారుల సమీక్షా హాల్ ఏర్పాటు చేసే విషయమై ఎస్పీ ఈ పరిశీలన చేపట్టారు.

వ్యాధులపై గ్రామాల్లో అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం, జూలై 31 : డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని బుధవారం సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ, డాక్టర్ ఎస్.వాసంతి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వ్యాధులు సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు, ఎఫ్‌డీపీ క్లస్టర్ పర్యవేక్షకుడు డాక్టర్ పీఎస్‌పీఎస్ ప్రసాద్, సీహెచ్ఎస్ఎం రత్నసఖి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ఎస్‌వీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో రైతు సంఘ కార్యవర్గం ఎన్నిక

మునగపాక (తుమ్మపాల), జూలై 31 : మండల కేంద్రం మునగపాకలో బుధవారం ములబంధగోడి రైతు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా దాడి శివ, కార్యదర్శిగా ఆడారి రాము, కోశాధికారిగా దొడ్డి గంగ సూరిఅప్పారావు, డైరెక్టర్లుగా బొడ్డేడ రాము, టెక్కలి శ్రీనివాసరావు, సూరిశెట్టి కాశీ, దొడ్డి మురళీ, యల్లపు శ్రీను, దాడి సాంబశివ, కొర్ని వెంకట్ ఎన్నికయ్యారు.

పింఛనర్లు అందుబాటులో ఉండాలి : జెడ్సీ

అనకాపల్లి టౌన్, జూలై 31 : పింఛనర్లంతా పించన్ పొందేందుకు గురువారం అందుబాటులో ఉండాలని జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు కోరారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి పింఛన్ నగదు ఆయా లబ్ధిదారులకు అందజేయనున్నారన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం తప్పనిసరిగా తమ నివాసాలకు వచ్చి సదరు నగదు అందుకోవాలన్నారు. అనకాపల్లిలో పదివేల పది మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరికి పింఛన్లు పంపిణీకి సంబంధించి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చెప్పారు. 217 మంది సచివాలయ ఉద్యోగులు ఈ సేవలు అందించనున్నారన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నక్కపల్లి, జూలై 31 : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ప్రిన్సిపాల్ కెశ్రీదేవి, అధ్యాపకులు నోట్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. గత ఏడాది ఇంటర్‌లో తమ కళాశాల మంచి ఫలితాలు సాధించి జిల్లాలో నాలుగో స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో అధ్యాపకులు, విద్యార్థులు ముందుకు సాగుతున్నట్టు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా

కోటవురట్ల, జూలై 31 : రాజుపేట సర్పా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తెల్లవారుజామున సర్పా నదిలో మాకవరపాలెం మండలానికి చెందిన చెందిన రుత్తల శ్రీనివాసరావు అనే వ్యక్తి ట్రాక్టర్ ద్వారా ఇసుకను అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తు తెలియని వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. దీనిపై అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. రెవెన్యూ అధికారుల వద్ద ప్రవేశపెట్టగా రూ.పదివేలు జరిమానా విధించారు.

'స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి'

అనకాపల్లి టౌన్, జూలై 31 : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మొల్లి రమణబాబు ముఖ్యమంత్రిని కోరారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న 139 బీసీ కులాలకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను మంజూరు చేయాలన్నారు. గత ఐదేళ్ల బీసీ కార్పొరేషన్ గురించి పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన బీసీలందరికీ పింఛన్ మంజూరు చేయాలన్నారు.

ఆర్థో సేవల్లో నక్కపల్లి ఆస్పత్రికి మొదటి స్థానం



ప్రథమ స్థానంలో నిలిచిన నక్కపల్లి సీహెచ్‌సీ

నక్కపల్లి, జూలై 31: ఆర్థోపెడిక్ సేవల్లో నక్కపల్లి సీహెచ్‌సీకి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించింది. జూలై ఒకటి నుంచి 15వ తేదీ వరకూ ఇక్కడి యాభై పడకల ఆస్పత్రిలో సుమారు 30 మంది రోగులకు పలు రకాల శస్త్ర చికిత్సలను ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్ చేశారు. బుధవారం సాయంత్రం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ సిరి రాష్ట్ర వ్యాప్తంగా సీహెచ్‌సీలలో ఆర్థోపెడిక్ సేవలపై సమీక్ష జరిపారు. జిల్లా ఆస్పత్రులను మినహాయిస్తే, 50 పడకల ఆస్పత్రుల్లో నక్కపల్లి సీహెచ్‌సీ జూలై మొదటి పక్షంలో మొదటి స్థానంలో నిలిచినట్టు ఆమె ప్రకటించారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ శిరీషా, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్‌ను పలువురు అభినందించారు.

ఆరోగ్యసేవల్లో గొటివాడ ఆయుష్మాన్ కేంద్రానికి ద్వితీయ స్థానం



గొటివాడలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంవైద్య సిబ్బంది సంబరాలు

సబ్బవరం : గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో మండలంలోని గొటివాడలో గల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై నాలుగో తేదీన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ ప్రొగ్రామ్‌లో భాగంగా ఢిల్లీ నుంచి డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ జయలక్ష్మి బృందం వచ్చి ఇక్కడి ఆయుష్మాన్ కేంద్రాన్ని సందర్శించారన్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు గురించి ఆరా తీసినట్టు చెప్పారు. అలాగే, గ్రామంలో పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారన్నారు. ఈ మేరకు బుధవారం ద్వితీయ స్థానానికి ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు చెప్పారు. వైద్య సిబ్బందిని సర్పంచ్ సాలాపు మీన, సాలాపు వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశాలత, సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్ఈవో జేసుదాస్, ఆర్.శిరీషా తదితరులు పాల్గొన్నారు.

రైతులు సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



విత్తన ఉత్పత్తిపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కోటవురట్ల, జూలై 31 : రైతులు సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయా ధికారి మోహన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని యండపల్లిలో రైతులకు విత్తనఉత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నారుమడి నుంచి పంట కోత వరకు పాటించాల్సిన మెళకువలను వివరించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మూడు దశల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాలు ఉటాయని, రైతులు సాంకేతిక సలహాలు పాటించాలని సూచించారు. అనంతరం బీకేపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారిణి సరోజని, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలి బాలికోన్నత పాఠశాల హెచ్ఎంకు చార్జిమెమో

- జూనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్
- జారీ చేసిన డీఈవో వెంకటలక్ష్మమ్మ



ఎలమంచిలి, జూలై 31 : విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైన ఎలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని, జూనియర్ అసిస్టెంట్‌పై డీఈవో వెంకటలక్ష్మమ్మ చర్యలు తీసుకున్నారు. ఈ పాఠశాలను మంగళవారం డీఈవో తనిఖీ చేసిన సమయంలో హెచ్ఎం హిమబిందు విధుల్లో లేరు. ఎటువంటి అనుమతి తీసుకోకుండా గైర్హాజరు కావడంతో హెచ్ఎంకు చార్జిమెమో, అదే విధంగా జూనియర్ అసిస్టెంట్ అమ్మాజీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే, పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయిని పనితీరు విద్యార్థినులు జిల్లా విద్యాశాఖాధికారిణి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆమె ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఈ అంశాలను డిప్యూటీ డీఈవో అప్పారావు వద్ద ప్రస్తావించగా, హెచ్ఎంకు చార్జిమెమో, జూనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం వాస్తవేమనని వెల్లడించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, జూలై 31 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం పదినుంచి మధ్యాహ్నం పన్నెండు వరకు కోట్నీవీధి, గాంధీబొమ్మ సెంటర్, పెరుగుబజార్, కరణాల వీధి, పప్పుల వీధి, మళ్లవీధి, బొగ్గారపువారి వీధి, తాకాశి వీధి, రావుగోపాలరావు కళాక్షేత్రం, న్యూకాలనీ, పట్టణ బాలికోన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, ఎల్ఐసీ ఆఫీస్, సత్యా థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాయకరావుపేట: ఇక్కడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేట ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టడం కోసం ఆ రోజు ఉదయం ఎనిమిది నుంచి పదకొండు గంటల వరకు పట్టణంలోని మెయిన్‌రోడ్డు, బృందావనం, ప్రశాంతినగర్, రాజుగారిబీడు, చినపీర్లు పంజావీధి, పెదిరెడ్డి వారివీధి తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

అచ్యుతాపురం : విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శుక్రవారం కొండకర్ల సబ్‌స్టేషన్ పరిధి పలు గ్రామాలకు సరఫరా ఉండదని డీఈఈ తెలిపారు. ఈ పరిధిలో గల కొండకర్ల, మల్లవరం, నరేంద్రపురం, ఎంజేపురం, ఉప్పవరం, అందలా పల్లి, చోడపల్లి, హరిపాలెం, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, పెదపాడు, ఎర్రవరంలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు వయనాడ్, నాడు కోడిపుంజువలస..

... 5వ పేజీ తరువాయి

కొట్టుకుపోయారు. మూగజీవాలు కూడా వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. బండరాళ్లు దొర్లుకొస్తున్నా ఈదురుగాలుల వల్ల ఆ శబ్దం తమకు వినిపించలేదని అప్పట్లో బాధితులు తెలిపారు. 70కి పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. అప్పటి ప్రభుత్వం స్పందించి ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్‌ఆధ్వర్యంలో బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి వసతులు కల్పించింది. మృతుల కుటుంబానికి రూ.2.5 లక్షల చొప్పున పరిహారం అందజేసింది. ప్రతి కుటుంబానికి జీవనోపాధి కోసం జత దుక్కిటెద్దు, నివాసం కోసం మోడల్ కాలనీని మంజూరుచేశారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి సహాయాన్ని అందించాయి. అదే తరహాలో 2014 అక్టోబరు 8వ తేదీన హుద్‌హుద్ తుఫాన్ వల్ల మాదల పంచాయతీ మేదరశాల గ్రామంపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు సజీవ సమాధి అయ్యారు. వరద వల్ల మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొండలను ఆనుకుని చాలా గ్రామాలు ఉన్నాయి. కోడిపుంజువలస ఘటన అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పాలకులు భావించినా చాలామంది సుముఖత చూపలేదు. వయనాడ్ ఉదంతం నేపథ్యంలో జిల్లా అధికారులు కొండవాలు గ్రామాల్లో ఉంటున్న వారి రక్షణపై దృష్టి పెట్టాల్సి ఉంది.



గ్రామంపైకి వచ్చిన కొండచరియ (ఫైల్)

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

చర్చిస్తారు. ఎన్నికల కమిషనర్ నుంచి అనుమతి వస్తే ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు ఈ సదస్సుకు హాజరవుతారు. ఇంకా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తుంటారు. సాధారణంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీనిపై కూడా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు.

అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణంపై విజిలెన్స్ విచారణ

» స్పీకర్ అయ్యన్నను కోరిన టీడీపీ కౌన్సిలర్లు



అయ్యన్నకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

నర్సీపట్నం, జూలై 31 : మునిసిపాలిటీ ఏడో వార్డులో నాణ్యత లేకుండా నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సభాపతి అయ్యన్నపాత్రుడుకి టీడీపీ కౌన్సిలర్లు కోరారు. బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ వైసీపీ పాలనలో మునిసిపాలిటీలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. అభివృద్ధిని తిరిగి కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజేశ్, పెదిరెడ్ల దివ్య, రావాడ లక్ష్మి, గుడివాడ రాజులనాయుడు, జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య, టీడీపీ నాయకుడు పైల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి సమస్యలు

మర్యాదపూర్వకంగా కలిసిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జస్టిస్ గిరిధర్‌ను కలిసిన నర్సీపట్నం బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం, జూలై 31 : బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నర్సీపట్నం కోర్టు సముదాయంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెట్టా ప్రభాకర్, అనిమిరెడ్డి శివకృష్ణ తీసుకెళ్లారు. అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నియామకం, కోర్టు భవనం రెండో అంతస్తు నిర్మాణానికి త్వరగతిన అనుమతులు, మహిళా న్యాయవాదులకు వసతులు ఏర్పాటు గురించి వివరించారు. సమస్యల పరిష్కారానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారని న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణమోహన్, స్థానిక బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కోసూరి అప్పలనాయుడు, మాజీ కార్యదర్శి లోకా లోవరాజు, కేవీ రమణ, వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ లేకుండా ల్యాబ్ పరీక్షలు : ఎస్ఎఫ్ఐ డిమాండ్

నర్సీపట్నం, జూలై 31 : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో వచ్చే నెల 12న జరిగే ల్యాబ్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీనివాసచారికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ప్రైవేటు ఐటీఐలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కోర్సులకు తగ్గట్టు ల్యాబ్ సౌకర్యాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్, నాతవరం సెక్రటరీ రాజు పాల్గొన్నారు.

ఇరుకు భవనంలోనే వైద్య సేవలు

» రెండేళ్లుగా దీనావస్థలో పీహెచ్‌సీ



చీడిగుమ్మలలోని పీహెచ్‌సీ ఇదే..



ఇరుకు గదిలోనే సేవలు అందిస్తున్న సిబ్బంది

గొలుగొండ, జూలై 31 : చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (పీహెచ్‌సీ)ను ఇరుకు గదుల్లో నిర్వహిస్తుండడంతో రోగులు, సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండేళ్ల నుంచి ఈ దీనావస్థలోనే పీహెచ్‌సీ నడుస్తోంది.ఇందులో కొమిర, ఏటిగైరంపేట, కొత్తఎల్లవరం, కశిమి, చీడిగుమ్మల-1, 2, గుండుపాల గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. సుమారు 22 వేల జనాభా ఉంటారు. 2022లో చీడిగుమ్మల గ్రామంలో పీహెచ్‌సీ ప్రారంభమైంది. అయితే పీహెచ్‌సీ నిర్వహణకుఅవసరమైన స్థాయిలో భవనం లేకపోవడంతో చీడిగుమ్మల గ్రామపంచాయతీ భవనంలో వైద్య సేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులతో పాటు మరో 12 మంది సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం 15 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన గ్రామపంచాయతీ భవనంలో వైద్య సేవలు అందిస్తున్నారు. రోజూ వందమందికి పైగా రోగులు పీహెచ్‌సీకి వైద్యం కోసం వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనం గదులు ఇరుకుగా ఉండడంతో కనీసం రోగులకు సిలైన్ అందించేందుకు కూడా అనువుగా ఉండడం లేదు. పీహెచ్‌సీ ఇరుకుగా ఉండడంతో చిన్నపాటి జ్వరాలు సోకిన రోగులకు అవగాహన కల్పించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. దీంతో అన్ని వసతులు కలిగిన ప్రైవేటు భవనమైనా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

8న పాఠశాలల మేనేజ్‌మెంట్

కమిటీలకు ఎన్నిక

» ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు, జూలై 31 : పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని ఎంఈవో కె.సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీల పేరును మేనేజ్‌మెంట్ కమిటీలుగా మార్పు చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎంపికైన కమిటీల పదవీకాలం జూలైతో ముగియడంతో ఆగస్టులో ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిందన్నారు. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు ఎన్నికలకు ఈ నెల 1న మధ్యాహ్నం రెండు గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు.ఆగస్టు ఐదో తేదీన ఉదయం తొమ్మిది గంటల నుంచి పది గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం మూడు, నాలుగు గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారని అన్నారు. ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహిస్తారని, అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నఈ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు ఎంతో పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈవో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో 51 ప్రాథమిక, తొమ్మిది యూపీ, 11 హైస్కూళ్లలో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు గురువారం ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు ఎంఈవో తలుపులు తెలిపారు.

అందరి సహకారంతో అభివృద్ధికి కృషి : ఎంపీపీ లక్ష్మి

దేవరాపల్లి, జూలై 31 : అందరి సహకారం, ఐక్యతతో మెలగి మండల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఎంపీపీ చింతలబుల్లి లక్ష్మి పేర్కొన్నారు. నూతనంగా ఎంపీపీ బాధ్యతలు చేపట్టిన లక్ష్మికి రైవాడ ఎరకాలమ్మ గుడి వద్ద బుధవారం వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు అధ్యక్షతన అభినందన సభ ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి పదవికి ఇటీవల రాజీనామా చేయడంతో ఉపాధ్యక్షురాలుగా ఉన్న బుల్లిలక్ష్మి ఎంపీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ రాజకీయ అనుభవం లేని తన కుటుంబానికి తన భర్త సర్పంచ్‌గా, తాను ఎంపీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, చింతల వెంకట రమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు సన్మానించారు.

విత్తనోత్పత్తిపై అవగాహన సదస్సు



మాడుగుల రూరల్, జూలై 31 : మండలంలోని అవురువాడలో బుధవారం మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ రైతులకు ఎంటీయూ 1061 (ఇంద్ర) వరి రకం పునాది విత్తనం (ఫౌండేషన్ విత్తనం) 7.50 క్వింటాళ్లు రాయితీపై సరఫరా చేశారు. ఈ వరి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక పద్ధతులు, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలను వివరించారు. అలాగే సాగరం గ్రామంలో వరి నాట్లను పరిశీలించారు. వరినాట్లు వేసేటప్పుడు వరి ఆకు చిగుళ్ల తుంచి నాటాలని సూచించారు. దీనివల్ల వరి ఆకు చిగుళ్లపై ఆకుముడత పురుగు గుడ్లను పొదిగి ఉన్నట్టయితే వాటిని తీసే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది స్వప్న, రైతులు పాల్గొన్నారు.

వడ్డాది కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

» చోడవరం ఎమ్మెల్యే కేవీఎస్ఎన్ఎస్ రాజు



ఎమ్మెల్యే రాజుకు సమస్యలు వివరిస్తున్న కళాశాల సిబ్బంది

బుచ్చెయ్యపేట, జూలై 31 : వడ్డాది జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనపై చోడవరం ఎమ్మెల్యే కేవీఎస్ఎన్ఎస్ రాజు బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే సమస్యల గురించి ఆరా తీశారు. కళాశాలలో వృత్తి విద్యా కోర్సుల కోసం ఎనిమిది అదనపు గదులు, విద్యార్థులకు హాస్టల్ సదుపాయం, సభా వేదిక నిర్మాణానికి నిధులు మంజూరు, పార్కింగ్ స్టాండ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కళాశాల మైదానం అభివృద్ధి, నిలిపివేసిన మధ్యాహ్న భోజనం పథకం పునరుద్ధరించడం వంటి చేపట్టాలని ఎమ్మెల్యే రాజును కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కోరారు.మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, గ్రామ ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్, జనసేన పార్టీ నాయకులు దొండా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు సీసీఆర్‌సీ తప్పనిసరి



రైతులకు కార్డులు అందజేస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు, జూలై 31 : సాగు చేస్తున్న ప్రతి కౌలు రైతు క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డు (సీసీఆర్‌సీ-కౌలు చేస్తున్న ధ్రువపత్రం) తప్పనిసరిగా పొంది ఉండాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఎ.కోడూరులో రైతుకు కౌలు రైతు ధ్రువపత్రం అందజేశారు. ఈ సీసీఆర్‌సీ కార్డు తీసుకున్న రైతులు ఈ-పంట, పెట్టుబడి సహాయం, పంట బీమా, ధాన్యం సేకరణ వంటి వాటికి అర్హులవుతారని అన్నారు. ఈ కార్డు కోసం అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్డును 11 నెలలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 20 రెవెన్యూ గ్రామాల్లో సీసీఆర్‌సీ పత్రాలను అందజేసినట్టు ఏవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎ.కోడూరు వీఆర్వో, సెక్రటరీ, ఎంపీఈవో విజయ్, రైతు లెక్కల దేముడు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు



గొలుగొండ, జూలై 31 : సీజనల్ జ్వరాలు వ్యాపిస్తున్న నేపథ్యంలో బుధవారం కశిమి, వడపర్తి, దోనిపాలెం, చిన కశిమి గ్రామాల్లో చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారి ధనంజయ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి రక్తపూతలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

దళితులకు భూములు అప్పగించాల్సిందే : పౌర హక్కుల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

చీడికాడ, జూలై 31 : రైతుల ఆక్రమణలో ఉన్న శ్మశానవాటిక భూములను వెంటనే దళిత కుటుంబాలకు అప్పగించాలని పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మరువాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా మండలంలోని చుక్కపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల కాలనీలో మంచినీటి బోరు మంజూరు చేయాలని, అలాగే మురికి కాలువలు నిర్మించాలని, గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక కింద గతంలో ప్రభుత్వం రెండు ఎకరాల 30సెంట్లు ప్రభుత్వం కేటాయిస్తే కొంతమంది భూస్వాములు ఆక్రమించుకొని సాగుచేసుకొంటున్నారని, దీనివల్ల దళిత కుటుంబాల్లో ఎవరు మృతి చెందినా ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మరువాడ ఈశ్వరరావుతో పాటు దళిత కుటుంబ సభ్యులు మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అలాగే దళితవాడలో డ్రైనేజీల నిర్మాణం, మంచినీటి బోరు విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎల్.కామేశ్వరరావు, ఆర్ఐ కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి అచ్చియ్యమ్మ, మహిళ పోలీస్‌లు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ విజయలక్ష్మి

బుచ్చెయ్యపేట, జూలై 31 : రాజ్యాంగం ద్వారా లభించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈవోపీఆర్డీ విజయలక్ష్మి పేర్కొన్నారు. సర్పంచ్ గొలజాన శ్రీను అధ్యక్షతన జరిగిన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ పౌరహక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరహక్కులపై ఆమె అవగాహన కల్పించారు.

వీధి కుక్కలతో జనం బెంబేలు



గొలుగొండ, జూలై 31 : పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందంటూ పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని గొలుగొండ, జోగంపేట, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం, పాతమల్లంపేట, పాకపాడు, గుండుపాల, కొత్తఎల్లవరం గ్రామాల్లో వీధికుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తుంటాయి దీంతో వీధుల్లో ప్రజలు తిరిగేందుకు పిల్లలు, మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులను వెంటాడి మరీ కుక్కలు కరుస్తున్నాయి. దీంతో వాహనదారులు గాయాల పాలవుతున్న సంఘటనలు ఎన్నో ఉంటున్నాయి. అధికారులువీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

చర్చిస్తారు. ఎన్నికల కమిషనర్ నుంచి అనుమతి వస్తే ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు ఈ సదస్సుకు హాజరవుతారు. ఇంకా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తుంటారు. సాధారణంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీనిపై కూడా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

మాడుగుల రూరల్, జూలై 31 : మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన గొర్లె సతీశ్ అనే యువకుడు ఏడాది కిందట విద్యుదాఘాతానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు స్పందించి వైద్యం నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆర్గనైజేషన్ సభ్యులకు బాధితునికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పెంకి శివ, భోగేశ్, తలుపులయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాడు కోడిపుంజువలస...

.. 5వ పేజీ తరువాయి



గ్రామంపైకి వచ్చిన కొండ చరియ (ఫైల్ ఫోటో)

కొట్టుకుపోయారు. మూగజీవాలు కూడా వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. బండరాళ్లు దొర్లుకొస్తున్నా ఈదురుగాలుల వల్ల ఆ శబ్దం తమకు వినిపించలేదని అప్పట్లో బాధితులు తెలిపారు. 70కి పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. అప్పటి ప్రభుత్వం స్పందించి ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్‌ఆధ్వర్యంలో బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి వసతులు కల్పించింది. మృతుల కుటుంబానికి రూ.2.5 లక్షల చొప్పున పరిహారం అందజేసింది. ప్రతి కుటుంబానికి జీవనోపాధి కోసం జత దుక్కిటెద్దు, నివాసం కోసం మోడల్ కాలనీని మంజూరుచేశారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి సహాయాన్ని అందించాయి. అదే తరహాలో 2014 అక్టోబరు 8వ తేదీన హుద్‌హుద్ తుఫాన్ వల్ల మాదల పంచాయతీ మేదరశాల గ్రామంపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు సజీవ సమాధి అయ్యారు. వరద వల్ల మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొండలను ఆనుకుని చాలా గ్రామాలు ఉన్నాయి. కోడిపుంజువలస ఘటన అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పాలకులు భావించినా చాలామంది సుముఖత చూపలేదు. వయనాడ్ ఉదంతం నేపథ్యంలో జిల్లా అధికారులు కొండవాలు గ్రామాల్లో ఉంటున్న వారి రక్షణపై దృష్టి పెట్టాల్సి ఉంది.

☛ సంక్షిప్తంగా..

వీధి కుక్కల్ని నియంత్రించండి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న వేదిక ప్రతినిధులు

దేవరాపల్లి, జూలై 31 : గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్న కుక్కల నిర్మూలనకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో ఎస్.అప్పలరాజుకు బుధవారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ వినతిపత్రం అందించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయన్నారు. రాత్రి 8 గంటల తర్వాత రోడ్లపై గుంపులుగా తిరుగుతూ అరుస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయని ఆయన ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు కె.శ్రీను, సంతోష్, చొక్కాకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ పండగ



చీడికాడ, జూలై 31 : ఈ నెల 1న మండలంలోని బి.సింగవరంలో శ్రీమరిడిమాంబ దేవాలయంలో పండగను నిర్వహించనున్నట్టు ఆ గ్రామ ఉత్సవ కమిటీ పెద్దలు తెలిపారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పండగ ఘనంగా నిర్వహించనున్నామని వారు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

రావికమతం, జూలై 31 : మండలంలో ఆగస్టు ఒకటిన గురువారం సామాజిక పింఛన్లు పంపిణీకి అవసరమైన ర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో భానోజీరావు తెలిపారు. మండలంలో వివిధ కేటగిరిలకు చెందిన 12 వేల 276 మంది పింఛనుదారులు ఉన్నారన్నారు. వీరందరికీ రూ.5 కోట్ల 22 లక్షల 28 వేల రూపాయలు నిధులు సిద్ధంచేశామన్నారు. ఈ పింఛన్లను ఇంటింటికీ వెళ్లి అందించేందుకు మండల పరిషత్, రెవెన్యూ, ఐసీడీఎస్, సచివాలయం, ఆరోగ్యశాఖకు చెందిన 189 మంది సిబ్బందిని ఎంపిక చేశామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రోలుగుంట, జూలై 31 : 11 కేవీ రోలుగుంట ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈ నెల 2న రోలుగుంటతో పాటు కొవ్వూరు సన్ ఫుడ్ కార్పొరేషన్ బిట్ లైన్, ఓలం ఫ్యాక్టరీ లైను, స్టోన్ క్రషర్ల లైనులో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరాపలి : మండలంలోని తారువ సబ్ స్టేషన్ మరమ్మతు పనులు చేపడుతుండడంతో ఈనెల 2న ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. తారువ, తిమిరాం, మామిడిపల్లి, వాకపల్లి, చీడికాడ మండలం నీలంపేట, కొత్తూరు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కె.కోటపాడు :మండలంలోని గొండుపాలెం విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ తెలిపారు. చెట్ల కొమ్మలు కొట్టడం, ఇతర మరమ్మతు పనులు చేపడుతుండడంతో మండలంలోని గుల్లేపల్లి, మల్లంపాలెం, చౌడువాడ, గొండుపాలెం గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రిటైర్డ్ హెచ్‌ఎం రత్నాజీకి ఘన సన్మానం



రత్నాజీ దంపతులకు సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణాదేవిపేట, జూలై 31 : గొలుగొండ మండలం చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేస్తున్న జి.రత్నాజీ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకుడు డి.గోపీనాథ్, ఎంఈవో సత్యనారాయణ, సుర్ల చిట్టిరాజు, గోర్లి లక్ష్మణ్, పలువురు పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు 'ఉపాధి' కల్పిస్తాం



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

రోలుగుంట, జూలై 31 : ఉపాధి హామీ పథకం అధికారులు తాతబాబు తదితరులు కొరుప్రోలు గ్రామాన్ని బుధవారం సందర్శించి గిరిజనులతో సమావేశం నిర్వహించారు. గిరిజనులకు సంబంధించి జాబ్ కార్డులను పరిశీలించి వివరాలు సేకరించారు.వారికున్న ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాలను పరిశీలించారు. జాబ్ కార్డులు ఉన్నవారందరికీ ఈ వారంలో ఉపాధి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా, తమకు జాబ్ కార్డులు ఉన్నా ఉపాధి పనులు కల్పించడం లేదని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని కోరుతూ ఈ నెల 30న జాబ్ కార్డులతో గిరిజన నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారులు కొరుప్రోలును సందర్శించి జాబ్‌కార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.